సాక్షి విశాఖపట్నం
బుధవారం ၊ 14 ၊ ఆగస్టు ၊ 2024



జూడాల విధుల బహిష్కరణ

పోస్ట్ గ్రాడ్యుయేట్ ట్రైనీపై లైంగిక దాడి, దారుణ హత్యకు నిరసనగా కేజీహెచ్ జూనియర్ వైద్యులు విధులు బహిష్కరించారు. 8లో



ఓటరు నమోదుపై సమీక్ష

స్పెషల్ సమ్మరీ రివిజన్ 2025 షెడ్యూల్ విడుదలపై కలెక్టర్లతో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సమీక్ష నిర్వహించారు. 8లో



ప్రజల ఆదరణే గొప్ప అవార్డు 8లో

మహనీయుల బాటలో నడుద్దాం



జాతీయ జెండాను ప్రదర్శిస్తున్న కళాకారులు



హర్ ఘర్ తిరంగా యాత్రలో పాల్గొన్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్, జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్

- కలెక్టర్ హరేంధిర ప్రసాద్
- ఉత్సాహంగా హర్ ఘర్ తిరంగా యాత్ర

బీచ్‌రోడ్డు: దేశ స్వాతంత్య్రం కోసం ఎన్నో త్యాగాలు చేసిన మహనీయుల సేవలను స్మరించుకుంటూ వారి బాటలో పయనిద్దామని కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ పిలుపునిచ్చారు. బీచ్‌రోడ్డులో మంగళవారం 'హర్ ఘర్ తిరంగా' యాత్ర నిర్వహించారు. జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్ కుమార్, పోలీస్ జాయింట్ కమిషనర్ ఫకీరప్పతో కలిసి కలెక్టర్ జెండా ఊపి.. యాత్రను ప్రారంభించారు. జిల్లాలోని వివిధ విభాగాల అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, సామాజిక కార్యకర్తలు, జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులు, విద్యార్థులు ఉత్సాహంగా యాత్రలో పాల్గొని.. భారత్ మాతాకీ జై అంటూ నినదించారు. ప్రతిజ్ఞ అనంతరం మువ్వెన్నల జెండా చేత బట్టి ముందుకు సాగారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్వాతంత్ర సమరయోధుల త్యాగాలు, సాహసాలను స్ఫూర్తిగా తీసుకుని.. దేశ ప్రయోజనాలు, సమాజ హితం కోసం పనిచేయాలన్నారు. అల్లూరి సీతారామరాజు వీరోచిత పోరాటం చేసి స్వాతంత్ర సంగ్రామంలో మనకంటూ ఓ స్థానాన్ని పదిలపరిచారన్నారు. ఆర్డీవో హుస్సేన్ సాహెబ్, జిల్లా టూరిజం అధికారి జ్ఞానవేణి, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ రామారావు, బీసీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాసరావు, డీఎస్‌డీవో జూన్ గ్యాలియట్, యూసీడీ పీడీ ఫణిరాం, డీపీఆర్వో ఎస్.వి.రమణ, అధికారులు, సామాజిక కార్యకర్తలు, గిరిజన మహిళలు పాల్గొన్నారు.



త్రివర్ణంలో పువ్వులు, కూరగాయలు

బీచ్‌రోడ్డులో భారీ అగ్ని ప్రమాదం



పార్కు నుంచి ఎగిసిపడుతున్న మంటలు

బీచ్‌రోడ్డులోని డైనోపార్క్‌లో మంగళవారం భారీ అగ్ని ప్రమాదం జరిగింది. కేవలం 15 నిమిషాల్లోనే పార్క్ మొత్తం బూడిదైంది. పార్కులోని ఏసీలు పేలి పెద్ద శబ్దాలు రావడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. ప్రమాదం ఉదయం జరగడంతో ప్రాణనష్టం తప్పింది. రూ.కోటి వరకు ఆస్తి నష్టం వాటిల్లినట్లు అంచనా.

- మెయిన్‌లో..



మంటలను అదుపు చేస్తున్న సిబ్బంది

న్యూస్‌రీల్

ఎమ్మెల్సీ ఎన్నికకు రెండే నామినేషన్లు

- ముగిసిన నామినేషన్ల ఘట్టం
- నేడు నామినేషన్ల పరిశీలన

మహారాణిపేట : స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు సంబంధించి నామినేషన్ల ఘట్టం మంగళవారంతో ముగిసింది. మొత్తంగా రెండు నామినేషన్లు దాఖలయ్యాయి. సోమవారం వైఎస్సార్ సీపీ నుంచి మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ, స్వతంత్ర అభ్యర్థిగా షఫీ ఉల్లా నామినేషన్ దాఖలు చేశారు. ఈ నామినేషన్లను బుధవారం పరిశీలన చేస్తారు. 16వ తేదీ వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు వుంది. ఈనెల 30వ తేదీన ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగుతుంది. సెప్టెంబర్ 3న ఓట్ల లెక్కింపు ఉంటుంది.

బొత్సకు అభినందనలు



బొత్సకు అభినందనలు తెలుపుతున్న బోని, మార్కెండేయులు, బీవీ రామ్ తదితరులు

ఎంవీపీకాలనీ: స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థి బొత్స సత్యనారాయణను వైఎస్సార్ సీపీ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ దేవరకొండ మార్కండేయులు, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు బోని శివ రామకృష్ణతో పాటు తెలుగు శక్తి అధ్యక్షుడు బీవీ రామ్ కలిశారు. బీచ్‌రోడ్డు దరి ఆయన నివాసంలో మంగళవారం కలిసి అభినందనలు తెలిపారు.

పోటీ నుంచి తప్పుకున్నా: బీవీ రామ్

దాబాగార్డెన్స్: ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ నుంచి తప్పుకుంటున్నట్టు తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ తెలిపారు. మంగళవారం వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేయాలని భావించానని.. అయితే బొత్స సత్యనారాయణ మాటకు గౌరవం ఇస్తూ పోటీ నుంచి విరమించుకున్నట్టు పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులతో విధానపరమైన పోరాటం తప్ప వ్యక్తిగత పోరాటం కాదన్నారు. తెలుగు జాతి అభివృద్ధికి పార్టీలకతీతంగా తమ పోరాటం కొనసాగిస్తానన్నారు.

తహసీల్దార్ హత్య కేసులో నిందితుడి బెయిల్ రద్దు

విశాఖ లీగల్: రూరల్ తహసీల్దార్ సనపల రమణయ్య హత్య కేసులో నిందితుడు ఎం.సుబ్రహ్మణ్య గంగారావు బెయిల్‌ను మంగళవారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్ రద్దు చేశారు. కొమ్మాది జంక్షన్ వద్ద తాను నివాసం ఉంటున్న అపార్ట్‌మెంట్‌లో ఈ ఏడాది ఫిబ్రవరి 2న తహసీల్దార్ రమణయ్య హత్యకు గురైన సంగతి విదితమే. ఈ కేసుకు సంబంధించి జిల్లా కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ కాండ్రేగుల జగదీశ్వరరావు అందించిన వివరాలివీ.. తహసీల్దార్ సనపల రమణయ్య హత్య కేసులో నిందితుడికి భీమిలి కోర్టు ఈ ఏడాది మే 14న బెయిల్ మంజూరు చేసింది. ఎం.సుబ్రహ్మణ్య గంగారావు ఈ కేసులో సాక్షులను ప్రభావితం చేస్తున్నారని పీఎంపాలెం పోలీసులు అతని కాల్ డేటా ఆధారంగా బెయిల్‌ను రద్దు చేయాలని జిల్లా ప్రధాన న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. కోర్టు ప్రాసిక్యూషన్ వాదనలతో ఏకీభవించి గంగారావు బెయిల్‌ను రద్దు చేసింది.

పీడీఎస్ సరకులపై ఫిర్యాదులకు కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్

మహారాణిపేట: పీడీఎస్ సరకుల పంపిణీ, ఫిర్యాదు కోసం కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ తెలిపారు. పీడీఎస్ సరకుల అక్రమ నిల్వ, రవాణా చేస్తున్నట్లు సమాచారం ఉంటే.. కంట్రోల్ రూమ్ నంబర్లు 0891-2590100, 2590102కు తెలియజేయాలని కోరారు.

అవయవ దానం.. ఎందరికో ప్రాణదానం



అవయవాలను దానం చేసిన కుటుంబసభ్యులను సన్మానిస్తున్న కలెక్టర్, జీవీఎంసీ కమిషనర్



కార్యక్రమానికి హాజరైన దాతల కుటుంబ సభ్యులు, నర్సింగ్, పారా మెడికల్ సిబ్బంది

- కలెక్టర్ హరేంధిర ప్రసాద్

మహారాణిపేట: అపోహలు వీడి అవయవదానం చేసేందుకు ముందుకు రావాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ పిలుపునిచ్చారు. అవయవదానం తప్పు కాదని.. మహోత్తర కార్యక్రమమని అభిప్రాయపడ్డారు. జీవన్‌దాన్ ఆధ్వర్యంలో ప్రపంచ అవయవదాన దినోత్సవం సందర్భంగా మంగళవారం వీఎంఆర్డీఏ బాలల ప్రాంగణంలో అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కుటుంబ సభ్యుల పూర్తి అంగీకారంతోనే బ్రెయిన్‌డెడ్ అయిన వారి నుంచి అవయవాలను సేకరిస్తామన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ఇతరులకు అవయవాలను అమర్చుతామన్నారు. ఈ విషయంలో దళారుల ప్రలోభాలకు గురికావద్దని కలెక్టర్ హితవు పలికారు. జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్‌కుమార్ మాట్లాడుతూ అవయవదానం పట్ల ప్రజల్లో మరింతగా అవగాహన కల్పించాలన్నారు. జీవన్‌దాన్ సమన్వయకర్త, విమ్స్ డైరెక్టర్ కె.రాంబాబు మాట్లాడుతూ బ్రెయిన్‌డెడ్ అయిన వ్యక్తి నుంచి సేకరించిన అవయవాలతో 8 మంది జీవితాల్లో వెలుగులు నింపవచ్చన్నారు. రాష్ట్రంలో 3 వేలకు మందికి పైగా అవయవాల కోసం నిరీక్షిస్తున్నారని తెలిపారు. దాతల సహకారంతో ఈ ఏడాది 136 మందికి అవయవాలను అమర్చామని, ఇది శుభ పరిణామమన్నారు. అనంతరం ఎక్కువ మంది దాతల నుంచి అవయవాలను సేకరించిన కిమ్స్ ఐకాన్, కేర్ యాజమాన్యాలను, బ్రెయిన్‌డెడ్ అయి అవయవాలను దానం చేసిన విపిన్ మెహతా, సీహెచ్ భవాని, ఆర్.రామలక్ష్మి, కె.పవన్‌కుమార్, వి.శ్రీనివాసరావు, ఎస్.లలిత కుటుంబ సభ్యులను సన్మానించారు. రెడ్‌క్రాస్ సంస్థ చైర్మన్ శివ నాగేశ్వరరెడ్డి, పలు ఆస్పత్రుల వైద్యులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, పారా మెడికల్ సిబ్బంది, నర్సింగ్ స్టాఫ్ పాల్గొన్నారు.

పసికందుకు పునర్జన్మ

- 56 రోజుల పాటు చికిత్స
- కేజీహెచ్ వైద్యుల ఘనత



బిడ్డను తల్లిదండ్రులకు అప్పగిస్తున్న కేజీహెచ్ సూపరింటెండెంట్ శివానంద్

మహారాణిపేట: అనారోగ్యంతో జన్మించిన ఓ శిశువుకు కేజీహెచ్ వైద్య నిపుణులు ప్రాణం నిలిపారు. కేవలం 1.6 కిలోగ్రాముల బరువుతో జన్మించిన ఈ పసికందుకు గుండె, ఊపిరితిత్తులు, లివర్ సంబంధిత సమస్యలు ఉన్నాయి. దీంతో కేజీహెచ్‌లోని నియోనేటల్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌లో చేర్పించారు. పిల్లల విభాగాధిపతి డాక్టర్ చక్రవర్తి ఆధ్వర్యంలో వైద్యులు 56 రోజుల పాటు చికిత్స అందించి ప్రాణాలు నిలబెట్టారు. వివరాలివీ.. కాకినాడకు చెందిన సునీత ఈ ఏడాది జూన్ 18న అత్యవసర పరిస్థితుల్లో కేజీహెచ్ గైనకాలజీ వార్డులో చేరారు. నెలలు నిండక ముందే ఆమె ప్రసవించారు. అతి తక్కువ బరువుతో జన్మించిన ఈ శిశువును పిల్లల విభాగాధిపతి డాక్టర్ చక్రవర్తి ఆధ్వర్యంలో వైద్యులు చికిత్స అందించారు. తొలి వారం శిశువును వెంటిలేటర్‌పై ఉంచి చికిత్స చేశారు. ఈ దశలో మూడు సార్లు రక్తమార్పిడి చేశారు. ఊపిరితిత్తుల్లో ఉన్న ఇబ్బందులను తొలగించారు. కొద్ది రోజుల చికిత్స అనంతరం శిశువు ఆరోగ్యం క్రమంగా మెరుగుపడింది. ఈ క్రమంలో 1.8 కి.గ్రా.లకు పెరిగింది. ఆయాసం తగ్గడంతో పాటు గుండె, కిడ్నీ, లివర్ పనితీరు మెరుగుపడి.. శిశువు తల్లిపాలు తాగే స్థాయికి చేరుకుంది. త్వరలో శిశువును డిశ్చార్జ్ చేస్తామని పిల్లల విభాగాధిపతి డాక్టర్ చక్రవర్తి తెలిపారు. పాపకు పునర్జన్మనిచ్చిన డాక్టర్ చక్రవర్తి, వైద్యులు సత్యకుమార్, సత్యవేణి, నర్సింగ్ సిబ్బందిని మంగళవారం సూపరింటెండెంట్ శివానంద్ అభినందించారు. ఈ సందర్భంగా శిశువు తల్లి దండ్రులు సునీత, విష్ణుమూర్తి మాట్లాడుతూ తమకు వివాహం జరిగి పదేళ్ల తర్వాత ఈ బిడ్డ జన్మించిందన్నారు. చాలామంది ఈ శిశువు బతికే అవకాశం లేదని చెప్పినప్పటికీ.. కేజీహెచ్ వైద్యులపై నమ్మకంతో ఇక్కడకు తీసుకొచ్చామన్నారు. ఇక్కడి వైద్యులు తమ కుటుంబంలో వెలుగులు నింపారని కృతజ్ఞతలు తెలిపారు.

కన్నతల్లి కర్కశత్వం

వంటపాత్రలు శుభ్రం చేయలేదని కుమార్తెను చావబాదిన తల్లి



బాలికతో మాట్లాడుతున్న ఎస్ఐ అసిరితాత

పెందుర్తి: ఆమె ఓ ప్రైవేట్ పాఠశాలలో ఉపాధ్యాయురాలు. పిల్లలకు విద్యాబుద్ధులు చెప్పాల్సిన ఆమె కన్నకూతురిపైనే దాష్టీకానికి పాల్పడింది. ఇంట్లో వంట పాత్రలు శుభ్రం చేయలేదని విచక్షణా రహితంగా చితకబాదింది. తల్లి కర్కశత్వానికి బెంబేలెత్తిన ఆ చిన్నారి ఇంటి నుంచి పరుగులు తీసి సమీపంలోని పోలీస్ స్టేషన్‌కు వెళ్లి తన గోడు వెళ్లబోసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. పెందుర్తిలోని సింహపురి కాలనీలో నివాసం ఉంటున్న స్వాతి సమీపంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తుంది. భర్తతో విభేదాల కారణంగా కుమార్తె(13)తో కలిసి ఉంటుంది. మంగళవారం ఉదయం ఇంట్లో వంట పాత్రలు శుభ్రం చేయమని కుమార్తెకు చెప్పింది. బాలిక వెంటనే ఆ పనిచేయక పోవడంతో కర్రతో చితకబాదింది. దీంతో మొహం, శరీరంపై తీవ్ర గాయాలు కావడంతో బాలిక భయంతో ఇంట్లో నుంచి పారిపోయి సమీపంలోని పోలీస్ స్టేషన్‌కు చేరుకుంది. వెంటనే బాధితురాలిని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. బాధిత బాలిక ఫిర్యాదు మేరకు స్వాతిపై కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నారు.

పంద్రాగస్టు వేడుకల ఏర్పాట్ల పరిశీలన

మహారాణిపేట: నగరంలోని పోలీస్ బ్యారెక్స్‌లో జరుగుతున్న స్వాతంత్ర దినోత్సవ ఏర్పాట్లను మంగళవారం కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ పర్యవేక్షించారు. జేసీ మయూర్ అశోక్, జాయింట్ సీపీ ఫకీరప్పతో పలు అంశాలపై చర్చించారు. పరేడ్ రిహార్సల్‌ను పరిశీలించారు. ఆర్డీవో డి.హుస్సేన్ సాహెబ్ ఇక్కడ జరుగుతున్న ఏర్పాట్లను కలెక్టర్‌కు వివరించారు.



రిహార్సల్ చేస్తున్న పోలీసులు

ప్రజల ఆదరణే గొప్ప అవార్డు

- విలక్షణ నటుడు చియాన్ విక్రమ్
- తంగలాన్ తన కెరీర్‌లో బెస్ట్ చిత్రమవుతుంది
- చాలా ఇష్టంతో చేసిన క్యారెక్టర్ ఇది
- సందడి చేసిన చిత్ర యూనిట్



మీడియా సమావేశంలో విక్రమ్, మాళవిక మోహనన్

కొమ్మాది: ఎన్నో విభిన్న చిత్రాలు చేశా..ప్రతి పనిలోనూ కష్టం ఉంటుంది. ఇష్టంగా చేయడం ద్వారా విజయం అందుకోవచ్చని విలక్షణ నటుడు చియాన్ విక్రమ్ అన్నారు. తంగలాన్ ప్రమోషన్‌లో భాగంగా మంగళవారం సాగర్‌నగర్ రాడిసన్ బ్లూలో హీరోయిన్ మాళవిక మోహనన్, నిర్మాత జ్ఞానవేల్ రాజాతో మీడియా సమావేశం నిర్వహించారు. కొత్తగా ట్రై చేసినప్పుడల్లా ప్రేక్షకులు తనను ఎంతగానో ప్రోత్సహించారన్నారు. ప్రజల ఆదరణే గొప్ప అవార్డుగా భావిస్తానన్నారు. తంగలాన్ చిత్రం కచ్చితంగా అందర్నీ మెప్పిస్తుందన్నారు. 5 భాషల్లో ఈ నెల 15వ తేదీన తంగలాన్ సినిమా విడుదల అవుతోందన్నారు. స్వాతంత్ర్యానికి ముందు కోలార్ గోల్డ్ ఫీల్డ్స్‌లో జరిగిన వాస్తవ సంఘటనల ఆధారంగా ఈ చిత్రం తెరకెక్కించినట్లు తెలిపారు. తంగలాన్ తన కెరీర్‌లో బెస్ట్ చిత్రమవుతుందన్నారు. సినిమా కోసం తాను చాలా కష్టపడ్డానని, ఏదైనా భిన్నంగా చేస్తేనే ప్రజల్లో చిరస్థాయిగా గుర్తుండిపోతామన్నారు. ఈ సినిమాలో తాను సరికొత్తగా కనబడబోతున్నట్లు పేర్కొన్నారు. 2022లో ప్రారంభమైన ఈ సినిమా షూటింగ్ ఇప్పటికి పూర్తయ్యిందని తెలిపారు. తంగలాన్ ట్రైలర్ ప్రస్తుతం ట్రెండింగ్‌లో ఉందన్నారు. తాను నటించిన శివపుత్రుడు, అపరిచితుడు, ఐ చిత్రాలను తెలుగు ప్రేక్షకులు ఎంతగానో ఆదరించారని, అదే విధంగా తంగలాన్ చిత్రాన్ని కూడా ఆదరించాలని కోరారు.

విశాఖ ఓ అద్భుతం

విశాఖ అంటే ఒక అందమైన అద్భుతమైన ప్రదేశం. యూనివర్సిల్ హీరో కమల్‌హాసన్ నటించిన మరోచరిత్ర సినిమాలో విశాఖ అందాలు చూశా. ఇంత గొప్ప ప్రదేశామా..కచ్చితంగా ఒక్కసారైనా విశాఖ వెళ్లి అక్కడ అందాలు చూడాలని అనుకున్నా... వివిధ సందర్భాల్లో విశాఖ వచ్చి ఇక్కడ ప్రకృతి అందాలను ఆస్వాదించా. అన్ని భాషల సినిమాలను ఆదరించే గొప్ప మనసున్నవారు విశాఖవాసులు అని అన్నారు.

ఐదు ప్రైవేట్ బస్సులపై కేసులు



తనిఖీలు చేస్తున్న రవాణా శాఖ అధికారులు

గోపాలపట్నం: నిబంధనలు ఉల్లంఘించి నడుపుతున్న ఐదు ప్రైవేట్ బస్సులపై రవాణా శాఖ అధికారులు కేసులు నమోదు చేశారు. నగర పరిధి ఆనందపురం టోల్‌గేట్ వద్ద రవాణా శాఖ ప్రత్యేక బృందాలు తనిఖీలు చేపట్టి.. ఐదు ప్రైవేట్ బస్సులు నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్నట్లు గుర్తించారు. ఈ బస్సులపై కేసులు నమోదు చేశారు. వారం రోజులుగా చేస్తున్న తనిఖీల్లో మొత్తం 10 ప్రైవేట్ బస్సులపై కేసులు నమోదు చేసినట్లు ఉపరవాణా కమిషనర్ రాజారత్నం తెలిపారు. అలాగే గాజువాక, మద్దిలపాలెం, ఆనందపురం, పెందుర్తి, భీమిలి, తగరపువలస ప్రాంతాల్లో స్కూల్ బస్సులు, ఆటోలపై తనిఖీలు చేశారు. ఈ తనిఖీల్లో 9 బస్సులు, 8 ఆటోలపై కేసులు నమోదు చేశారు. మొత్తంగా 95 బస్సులపై కేసులు నమోదు చేసి.. 9 బస్సులు సీజ్ చేశారు. 46 ఆటోలపై కేసులు నమోదు చేసి.. ఐదు ఆటోలను సీజ్ చేసినట్లు డీటీసీ వివరించారు.

ఓటరు నమోదుపై వీడియో కాన్ఫరెన్స్

మహారాణిపేట: స్పెషల్ సమ్మరీ రివిజన్ 2025 షెడ్యూల్ విడుదలపై జిల్లా కలెక్టర్లతో మంగళవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వివేక్ యాదవ్ వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. మంగళవారం విశాఖ కలెక్టర్ కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్, జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్ కుమార్ తదితరులు పాల్గొని జిల్లా ఓటర్ల నమోదు వివరాలను తెలిపారు. ఈఆర్‌వోలు, ఏఈఆర్‌వోలు, బీఎల్‌వోలకు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ తెలియజేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

ఇద్దరికి తీవ్ర గాయాలు



ఘటనాస్థలిలో మృతి చెందిన భీమాచారి

పెందుర్తి: వేపగుంట–పినగాడి రహదారి చీమలాపల్లి సమీపంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. మరో ఇద్దరు యువకులు తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. గోపాలపట్నం కుమారి కేటరింగ్‌లో పనిచేస్తున్న మొల్లెటి భీమాచారి(35), తమ్మిన సందీప్ బైక్‌పై పినగాడి వైపు వెళుతున్నారు. చీమలాపల్లి వద్దకు వచ్చేసరికి అదే సమయంలో చింతగట్లకు చెందిన గుడివాడ శ్యామ్ బైక్‌పై వస్తున్నాడు. రెండు బైక్‌లు బలంగా ఢీకొనడంతో సందీప్ బైక్ వెనుక కూర్చున్న భీమాచారి రోడ్డు పక్కన తుళ్లిపడడంతో తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మరణించాడు. సందీప్, శ్యామ్‌లు తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న పెందుర్తి ట్రాఫిక్ ఎస్ఐ నరసింహరాజు, సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని భీమాచారి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. సీఐ రామకృష్ణ ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు జరుగుతుంది.

జూనియర్ వైద్యులు విధుల బహిష్కరణ



జూనియర్ వైద్యులు ప్రదర్శన

మహారాణిపేట: పశ్చిమ బంగాలో పోస్ట్ గ్రాడ్యుయేట్ ట్రైనీపై లైంగిక దాడి, దారుణ హత్యకు నిరసనగా కేజీహెచ్‌లో జూనియర్ వైద్యులు మంగళవారం విధులు బహిష్కరించారు. దీంతో ఆస్పత్రిలో వైద్య సేవలకు స్వల్ప అంతరాయం కలిగింది. ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఓపీలను, వార్డులో రోగులను చూసే ప్రక్రియ నిర్వహించారు. జూనియర్ డాక్టర్‌ను హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలని, సెంట్రల్ హెల్త్ కేర్ ప్రొటెక్షన్ యాక్టును అమలు చేయాలని డిమాండ్ చేస్తూ జూనియర్ వైద్యులు ఆందోళన చేపట్టారు. కేజీహెచ్,ఆంధ్రా మెడికల్ కాలేజీ నుంచి మొదలైన ర్యాలీ వాచ్ హౌస్, జగదాంబ, కలెక్టర్ కార్యాలయం మీదుగా తిరిగి మెడికల్ కళాశాలకు చేరుకుంది. ఆంధ్రా మెడికల్ కాలేజీ జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు టి.పృథ్వీరాజ్, ఉపాధ్యక్షుడు ఆర్.ఊహ, కార్యదర్శి వివేక్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ సంయుక్త పాల్గొన్నారు.

రైల్లో పోగొట్టుకున్న బ్యాగ్ స్టీల్‌ప్లాంట్‌లో ప్రత్యక్షం



స్టీల్ సీఐటీయూ గౌరవాధ్యక్షుడు అయోధ్యరామ్‌కు బ్యాగ్ అందజేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు

ఉక్కునగరం: విధి విచిత్రం అంటే ఇదే.. రైలులో పోగొట్టుకున్న బ్యాగ్ స్టీల్‌ప్లాంట్‌లో ప్రత్యక్షమైంది. చెన్నైకు చెందిన కార్తికేయన్‌కు హైదరాబాద్‌లో ప్రైవేటు జాబ్ వచ్చింది. చేరేందుకు ఈనెల 8న శబరి ఎక్స్‌ప్రెస్‌లో కాట్పాడి నుంచి సికింద్రాబాద్ బయల్దేరాడు. రాత్రి రైలులో పక్కన కూర్చున్న యువకుడు మాటలు కలిపాడు. కొద్దిసేపటి తర్వాత మీరు పడుకోండి.. బ్యాగ్ చూస్తానని చెప్పాడు. దాంతో కార్తికేయన్ కొద్దిసేపు పడుకున్నాడు. తెల్లవారుజామున 2 గంటల సమయంలో కార్తికేయన్ లేచి చూడగా ఆ యువకుడు లేడు, బ్యాగ్ లేదు. అందులో ల్యాప్‌టాప్, ఏటీఎం కార్డులు, క్రెడిట్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, రూ.3 వేలు ఉన్న పర్సులతో మాయమయ్యాడు. దీంతో ఒంగోలు స్టేషన్‌లో దిగి ఆర్పీఎఫ్‌కు, స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశాడు. నిరాశతో హైదరాబాద్‌కు చేరుకున్నాడు. ఈలోగా దొంగతనం చేసిన వ్యక్తి పర్సును తీసుకుని బ్యాగ్‌ను గూడ్స్ ట్రైన్‌లో విసిరేసినట్టు తెలుస్తుంది. ఈ బ్యాగ్ స్టీల్‌ప్లాంట్ ఉత్పత్తుల కోసం ప్లాంట్‌కు చేరుకున్న గూడ్స్‌లో దొరికింది. ప్లాంట్ సీడీపై యార్డులో సరుకుల లోడింగ్ కోసం వెళ్లిన కాంట్రాక్ట్ కార్మికులు దామోదర్, తుకారమ్, గజేంద్రలు బ్యాగ్ తెరిచి చూడగా అన్ని వస్తువులు కనిపించాయి. అందులోని ఆధార్ కార్డ్ ఆధారంగా కార్తికేయన్‌కు ఫోన్ చేసి బ్యాగ్ విషయం తెలిపారు. స్టీల్ సీఐటీయూ గౌరవాధ్యక్షుడు జె.అయోధ్యరామ్‌కు ఆ బ్యాగ్‌ను అప్పగించారు. ఆయన ఆ బ్యాగ్‌ను కార్తికేయన్‌కు పంపించే ఏర్పాటు చేశారు. విషయం తెలిసిన కార్తికేయన్ ఆనందం వ్యక్తం చేశాడు. బ్యాగ్ అందజేసిన కాంట్రాక్ట్ కార్మికులకు కృతజ్ఞతలు తెలిపాడు.